
# చక్రం

కలిదిండి జయ




**అతను ఒక చిన్న వేషగాడు.**

**నేనొక పెద్ద డైరెక్టర్ని.**

**నాలాంటి పెద్ద డైరెక్టర్లకి చిన్న వేషగాళ్ళనిపట్టించు కోవల్సిన అవసరం గాని, యింట్రస్ట్ గాని వుండవు. నేను మరింత పెద్ద ప్రొడ్యూసర్లని, అంతకన్నా పెద్ద హీరోలని పట్టించుకోవడం నేర్చుకున్నాను కాబట్టే పెద్ద డైరెక్టర్ని కాగలిగాను.**


ఈ చిన్న వేషగాడు అంటే సినిమా పరిభాషలో "ఎక్స్‌ట్రా నటుడు." నా చుట్టూ పరిభ్రమణం చేస్తూ వుండేవాడు. వేషం యిప్పించమని సతాయిస్తుండేవాడు. నేనతన్ని విదిలించుకున్నాను; కసురుకున్నాను తిట్టాను కాని అతను మళ్ళీ...మళ్ళీ తిరిగి...తిరిగి నాదగ్గరికే వచ్చేవాడు. వేషం యిప్పించమని ప్రాధేయపడేవాడు. రోజుకూలీ వచ్చే చిన్న వేషం చాలనేవాడు. గుంపు సీనులలో 'ఒకడి'గా నిల్చునే చోటు యిప్పిస్తే చాలని పట్టుకునేవాడు. వెళ్ళి ప్రొడక్షన్ మేనేజర్ని కలువు అని విదిలించుకునే వాణ్ని.

ఒక రోజు సాయంత్రం మా యూనిట్ 'పెద్ద'లతో 'స్టోరీ' డిస్కషన్‌లో వుండగా అతను వచ్చాడు. స్క్రిప్టుమీద కూర్చోవడమంటే మరేమీ లేదు కాక్‌టైల్‌లో మునిగి తేలుతూ, వీడియోలో ఇంగ్లీషు ఫిల్ము చూస్తూ అందులో నచ్చిన భాగాల్ని నోట్ చేసుకుని, మేం తీసే సినిమాలో ఎలా యిరికించాలా అని ఆలోచించడం. కాని యిది నేను చెప్పినంత మీరు విన్నంత సులభం కాదు. ఇంగ్లీష్‌లో అన్ని మంచి సినిమాలలో, అందులో మరిన్ని మంచి సీన్లు వుండడం వల్ల—వేటిని లిఫ్ట్ చెయ్యాలో తెలీక, తికమకపడి, చివర్కి అందరం కల్సి ఆలోచించి...చించి...చించి విషయం తెగక, లాటరీ వేసి సీన్లు ఎన్నుకుంటాం. ఇంత కష్టతరమైన కార్యక్రమంలో వుండగా యితను వచ్చాడు.

నాకు ఒళ్ళు మండింది. అయినా తమాయించుకున్నాను. చిట్టచివరి సారిగా అతనికి ఘట్టిగా చీవాట్లు పెట్టడానికి నిర్ణయించుకుని, అతను వెయిట్ చేస్తున్న హాల్లోకి వచ్చాను.

ఆఫీస్‌బోయ్ అతన్ని మూడు గంటల సేపు వెయిటింగ్‌లో వుంచడం వలన యిక కూర్చోలేక వెళ్ళిపోయాడని తెల్సింది. ఆనందంగా నిట్టూర్చి, డిస్కషన్ రూము లోకి వెళ్తుండగా బయట ఏదో జరుగుతున్న కలకలం వినిపించింది.

గార్డుని పిల్చి విషయం ఏమిటని అడిగితే గార్డు "సార్ యిందాక మీకోసం వచ్చినతనే ప్లాట్‌ఫామ్ మీద కళ్ళుతిరిగి పడిపోయాడు" అని సాదాగా చెప్పి వెళ్ళిపోయాడు.




నేనూ ఆ విషయాన్ని అతి సీదాగా తీసుకుని లోపలికి వెళ్ళబోతుంటే—పాం రంగు సోఫాలో నలిగి తుప్పపట్టిన యినుప రంగులో ఒక డైరీ కన్పించింది. డైరీ తెరిచి మాశాను. ఆ ఎక్స్ట్రా ఆర్టిస్టు మీద నాకెప్పుడూ కుతూహలం కలగలేదు కాని ఈ డైరీలో ఆ అనామకుడు ఏం వ్రాశాడా అని కుతూహల పడ్డాను.

జనవరి 1, 1984.

నేను గత పది సంవత్సరాలుగా మంచి పాత్రలు దేవుడెరుగు—అసలు పాత్రంటూ దొరికితే చాలని ప్రయత్నిస్తున్నాను. విఫలమే! కాని అన్నోచోట్లా దర్శకులు, నిర్మాతలు ఈ 'రోజు- రేపు' అంటూ తిప్పతూనే వున్నారు. కొన్ని ఆశలు పేర్చుకుని, ఈ సినిమా రంగానికి వచ్చాను. ఆ ఆశలు నిజాలవడం మాట అలా పెట్టి, కనీసం రెండు పూట్లా ముద్దనోటి దగ్గరికి రావడం ఛేధు. నా ఆశలు—చేతికి నోటికి మధ్య దూరాన్ని పెంచుతున్నాయి కాని తరిగించడం లేదు.

ఫిబ్రవరి 12

నాన్నగారు పోయారు. అక్కడ మిగిలిన అర ఎకరం కొంద్రని అప్పుల వాళ్ళకి ధారపోసి, యింకా మిగిలిన అమ్మని, చెల్లెల్ని వెంటబెట్టుకుని మళ్ళీ యిక్కడికి వచ్చాను. అది వరకు నేనొక్కడ్నే నిలదొక్కుకోలేక పోతూ వచ్చాను. యిప్పుడు మరో రెండు జీవాలు...

మార్చి 2

జీవితం యింత అధ్వాన్నంగా రూపాంతరం చెందుతుందని నేను ఏనాడూ వూహించుకోలేదు. ఈరోజు ... స్టూడియోలో ఆరుగంటలు ఆలస్యమయిన షూటింగ్‌కి పడిగాపులు పడి—హీరో, గూండాల ఫైటింగ్ సీనులో, హీరో చేత పన్ను వూడగొట్టించుకున్నాను. సీను నాచురల్‌గా వుండాలని నిజంగానే హీరో నా పన్ను వూడగొట్టాడు. అసలు నాచురల్‌గా వుండాల్సిన 'ఈత' సీనులో, నీళ్ళంటే భయమని డూప్‌ని పెట్టుకున్నాడు. యింత లావున నా దవడ వాచింది. యిచ్చిన డెబ్భై ఐదు రూపాయల్లో ప్రొడక్షన్ మేనేజరు ముప్పై, అసిస్టెంటు డైరక్టరు మరో ముప్పై కొట్టేశారు. మిగతా పదిహేను రూపాయలు పుచ్చుకుని హాస్పటల్ వైపు వెళ్ళాను అక్కడ....

అసలు దేవుడంటూ వున్నాడా...?

ఏప్రిల్ 1

చెల్లెల్ని, అమ్మని చూస్తే గుండె తరుక్కుపోతోంది. కాని నేను చాతకాని వాడిలా మాత్రం నిల్చోగలిగాను. పోనీ ఎక్కడైనా వుద్యోగం సంపాదించుదామా అంటే— ఎవరిస్తారు నా ఫెయిల్డ్ ఎస్.ఎస్.సి., క్వాలిఫికేషన్‌కి? నిన్న గార్డెన్స్ దగ్గర గూర్ఖా లోపలికి వెళ్తుండగా, లాగి బయటకి గెంటేశాడు. వాడికి ఏదన్నా లంచం పెట్టాలి..యిలా అందరికీ చదివించుకుంటూ పోతుంటే మా మూడు పొట్టలకీ ఏం మిగుల్తుంది? —ఆడదాన్నయినా కాకపోయాను—ఒళ్ళమ్ముకుని అమ్మని చెల్లెల్ని పోషించేవాడ్ని—దేవుడు లేడనే అన్పిస్తోంది యిదంతా అనుభవిస్తోంటే....

1-11-1985 న విడుదల!

మల్లాది వెంకటకృష్ణమూర్తి

డైరెక్ట్ నవల

మందాకిని




విమర్శనాత్మకమైన దృష్టితో చదివే పాఠకులకు ఓ అపూర్వ అవకాశం

'మందాకిని' విడుదలైన పదిహేను రోజులలోపు (అంటే 15-11-85 లోపు) ఆ నవల మీద మీ అభిప్రాయాన్ని నవలలో పొందుపరిచిన కూపన మీద రాసి, దానితో మీ పాస్‌పోర్ట్ సైజు ఫోటో ఒక దానిని పంపితే, అందులో అత్యుత్తమమైన అభిప్రాయంగా ఎన్నికైన దానిని ఓ ప్రముఖ వారపత్రికలో అభిప్రాయం పంపిన వారి ఫోటోతో సహా ప్రచురించడమే కాక వారికి రూ. 200/- పారితోషికం కూడ పంపుతాము.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్

3237, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్ - 500 003.

నూతన యవ్వనం పొందండి

సంతానవంతులు కండి!

చర్మవ్యాధులనుండి విముక్తులు కండి!



దురభ్యాసముల వలన కలిగిన నరముల బలహీనత, దాంపత్య సుఖము లేక పోవుట, ఉబ్బసము, మేహ మచ్చలు, మొదలగు సమస్త దీర్ఘ వ్యాధులకు అద్భుత ఆయుర్వేద చికిత్స!

పోస్టు ద్వారా చికిత్స కలదు.

క్యాంపులు: *ప్రతి ఆదివారం భీమవరం—షణ్ముఖ లాడ్జిలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6-30 గంటల వరకు *ప్రతినెల 1 మరియు 16 తేదీలలో రాజమండ్రి—హోటల్ అశోకాలో కోటగుమ్మం దగ్గర మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు.

డా॥ డి. మార్కండేయులు

ఆయుర్వేదభిషక్, సెక్స్ స్కిన్ స్పెషలిస్ట్

పార్కురోడ్, గుడివాడ — 521 301

ఫోన్స్ : ఆఫీసు : 522 నివాసం : 540

మే 6

ఈ రోజు జ్వరం వచ్చి యింట్లోనే పడకేశాను. పాపం పక్కింటావిడ జాలిపడి అమ్మకి పది రూపాయలు అప్పిచ్చింది. దేవుడు వున్నాడనిపిస్తోంది....

జూన్ 11

అమ్మకి ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. ఆవిడ పరిస్థితి చూస్తుంటే కడుపులో దేవుతోంది. మోకాళ్ళు వాచిపోయి, మంచం మీద నించి లేవలేక పోతోంది. రాత్రికి రాత్రి తాగిన ఉప్పు గంజి అరగించుకోలేక వాంతి చేసుకుంది. మొహం యింత లావున వుబ్బి వుంది.

ఆగష్టు 15

స్వాతంత్ర్యం వచ్చిందని సిటీ అంతా కోలాహలంగా వుంది. ఫంక్షన్స్, మీటింగ్స్, ఉపన్యాసాలు సాగుతున్నాయి. ఈ రోజు నాకు కూడా వుషారుగా వుంది. సాగర్ యూనిట్ ప్రొడక్షన్ మేనేజరు రేపు షూటింగ్‌కి వేషం వుంది రమ్మన్నాడు.

ఆగష్టు 16

తీరా వెళ్తే—ఆ వేషం మరెవరికో యిచ్చేశాను వెళ్ళిరమ్మన్నాడు. నాకు కోపం వచ్చి అరిస్తే గూర్ఖా చేత తన్నించి బయటికి గెంటించాడు. యింటికి వచ్చేసరికి... అంతా అయిపోయింది...అమ్మ...యిక...లేదు...

అక్టోబర్ 23

బ్రతుకు యింత వ్యర్థంగా తయారవుతుందని కలగనలేదు. చెల్లెల్ని చూస్తుంటే ముందు ముందు భవిష్యత్ భయంకరంగా కన్పిస్తోంది. యిక్కడ, విపరీతమైన పోటీ—ఆ పోటీకి తట్టుకుని ఇంచాలిచ్చి, కమిషన్లు చదివించి నిలదొక్కుకోవాలంటే చాలా కష్టమై పోతోంది జీవితం. యిది వరకు కొద్ది లావుగా వుండే వాడ్ని కాబట్టి గూండా పోర్షన్సు అయినా యిచ్చేవారు. ఈ మధ్య తిండి లేక చిక్కి, ఎముకలు బయటపడే సరికి, ఆ పోర్షన్లు కూడా రావడం లేదు...

నవంబర్ 5

నిన్న శవం పాత్ర వేయడానికి అవకాశం వచ్చింది. నా మీద కప్పడానికి ఐదువందల రూపాయిలు పెట్టి పూలదండలు తెప్పించారు. కాని ఆ పోర్షన్ వేసినందుకు నాకు ముప్పై రూపాయలు కూడా యివ్వకుండా తగువు వేసుకున్నాడు ప్రొడక్షన్ మేనేజరు.

డిసెంబర్ 26

"వసంత కాలంలో ప్రతిసారీ ప్రతి తలుపూ, కిటికీ, అన్నీ చిగురించాలని ప్రయత్నిస్తాయి. అలాగే నేనూ శిథిలమయిపోయినా ప్రతి సెకండూ జీవించాలని ప్రయత్నిస్తున్నా కాని..." నేనేం చేస్తానో, ఏం చెయ్యాలో...అంతా అగమ్య గోచరం...భగవంతుడా మేం ఎలా బ్రతకాలి? ఎవరు మాపై దయచూపిస్తారు? ఎవరు? ఎవరు? ఎవరు...?

ఇక ఆ డైరీలో మరేమీ లేదు. అతను నా దగ్గరకు వచ్చింది ఆరోజే కనుక, ఆ డైరీలో మరిక అంతకన్నా మరేం వుండదు. ఇదంతా చదివిన నా కళ్ళల్లో సన్నటి నీటిపొర. హృదయం కదిలి, ఓ కన్నీటి చుక్క రాలి డైరీ మీద పడింది.

అంత వరకే...

మరో నెల గడిచాక కాబోల్ను అతను కన్పించాడు. మరింత చిక్కి, టి.బి. పేషెంటులా వున్నాడు. వేషం యిప్పించమని యథాప్రకారం అడిగాడు. నేను తప్పించుకుని వచ్చేశాను.

ఎందుకంటే...

నేను పెద్ద డైరెక్టర్ని!

అతను చిన్న వేషగాడు!

అంతే—మా యిద్దరికీ లంగరు కుదరదు.




# 1960కి ముందుగా మీరు జన్మించినట్లైతే ఈ ప్రకటన పూర్తిగా చదవండి.



10కి 9 మంది పైబడిన 25 ఏళ్ళకి పైబడ్డ వారికి జుట్టు వూడటం సంభవిస్తుంది...మరి ఇది వారికి తెలియదు!

**ఆ 9 మందలో మీరు ఒక్కరైతే ప్యూర్ సిల్వీక్రిన్ వాడటం నేడే ప్రారంభించండి.**

మీ దువ్వెనతో మీ జుట్టును గట్టిగా దువ్వండి. మీ దువ్వెన మీదకి వెంట్రుకలు వచ్చినట్టయితే ఆనవాలు మీ జుట్టు వూడిపోతుందన్న మాట. మీరు వెంటనే—అంటే యిప్పుడే చర్య తీసుకోవాలి. లేకపోతే మీ జుట్టు పల్చనై పోయినట్టు మీకు అద్దంలో స్పష్టంగా కన్పించటం ప్రారంభిస్తుంది. ముఖ్యమైన ఎమినో ఏసిడ్‌లు జుట్టుకి సహజమైన ఆహారం అవి కొరతైతే, జుట్టుపల్చబడిపోయి ఆరోగ్యం కోల్పోతుంది వాటి కొరతని తొలగించక పోయినట్టయితే జుట్టు వూడిపోతూనే వుంటుంది. అందుచేత మీరు ప్యూర్ సిల్వీక్రిన్ వాడటాన్ని ఈ రోజే ప్రారంభించటం అవసరం.




**ప్యూర్ సిల్వీక్రిన్‌లో ఏమిటి ఉంటాయంటే :**

① పెద్దది చేసిన ఒక ప్యూర్ సిల్వీక్రిన్ చుక్క సహజ జుట్టు అవసరాలని తీర్చేందుకు దేహం సమకూర్చే 17 ఎమినో ఏసిడ్‌ల అపూర్వ సమ్మేళనమే ప్యూర్ సిల్వీక్రిన్

**ప్యూర్ సిల్వీక్రిన్ ఎలా పని చేస్తుందంటే :**

② లోపలకు చొచ్చుకు వెళ్ళే చర్య

ప్యూర్ సిల్వీక్రిన్ వెంట్రుకల మొదళ్ళలోవరకు వెళ్ళేదాక దాన్ని తలమీద చర్మ భాగంలో యింకేట్టు బాగా మర్దనం చెయ్యండి శాస్త్ర పరిశోధనలతో రూపొందించి ప్యూర్ సిల్వీక్రిన్‌లో ఇమిడ్చిన ప్రక్రియ పద్ధతి యిప్పుడు పని చెయ్యటం ప్రారంభిస్తుంది: మళ్ళీ జుట్టు పెరుగుదల కొనసాగేట్టు దోహదం చేస్తుంది. మీ జుట్టు మళ్ళీ యథా ప్రకారం ఆరోగ్యంగా పెరిగే వరకూ మీరు ప్యూర్ సిల్వీక్రిన్‌ని రోజుకి రెండుసార్లు చొప్పున ప్రతి రోజూ వాడండి.




**ప్యూర్ సిల్వీక్రిన్**

OBM/9824/Tel